ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





గ్రామంలో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ పనులు(ఫైల్)

బిల్లుల కోసం తంటాలు

- వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.1.83 కోట్లతో పనులు
- నామినేషన్‌పై చేసిన పలువురు నాయకులు, కార్యదర్శులు
- మూడు మాసాలుగా బిల్లుల కోసం ప్రదక్షిణలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గత వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం పనులు చేపట్టారు. వాటికి సంబంధించిన బిల్లుల కోసం పంచాయతీ కార్యదర్శులు, పలువురు కాంట్రాక్టర్లు మూడు మాసాల నుంచి తంటాలు పడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా, ఎలాంటి ప్రొసీడింగ్స్, అగ్రిమెంట్లు లేకున్నా అధికారుల ఒత్తిళ్ల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేసినా కూడా మూడు మాసాల నుంచి బిల్లుల కోసం మిషన్ భగీరథ ఇంట్రా విలేజ్ అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి తలెత్తిందని పనులు చేసిన వాళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులకు సంబంధించి జూలై 4వ తేదీన ప్రొసీడింగ్స్ వెలువడినప్పటికీ, అగ్రిమెంట్లు పూర్తి చేసిన అధికారులు బిల్లులు చెల్లించడంలో జాప్యం చేస్తుండడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లోని గ్రామాలు, పట్టణాలకు తాగునీటిని మిషన్ భగీరథ పథకం ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి అందిస్తున్నారు. అయితే వేసవిలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీళ్లు అడుగంటడంతో మిషన్ భగీరథ ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నీరు అంద లేదు. దీంతో గ్రామాల్లో అక్కడక్కడ సరిపడా తాగునీరు ప్రజలకు అందలేదు. ఈ క్రమంలో ఎక్కడైతే గ్రామాల్లో క్రిటికల్ గ్యాప్స్ ఉన్నాయో వాటిని మే నెలలో గుర్తించారు. ఆ మేరకు మిషన్ భగీరథ ఇంట్రా విలేజ్ అధికారులు జిల్లావ్యాప్తంగా కోటి 83 లక్షల రూపాయలతో 185 క్రిటికల్ గ్యాప్స్ పనులను చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో ప్రధానంగా పైపులైన్ల మరమ్మతులు, చేతిపంపుల మరమ్మతులు, పాత స్కీం లకు మోటార్ల బిగింపు వంటి పనులు ఉన్నాయి. ఈ పనులన్నీ 40 వేల నుంచి 3 లక్షల లోపు మాత్రమే ఉండడంతో నామినేషన్ పద్ధతిన చేపట్టాలని నిర్ణయించారు.

● అధికారుల తాత్సారం..

అంతర్గాం మండలంలో 8 పనులు, పాలకుర్తి మండలంలో 17 పనులు, రామగుండంలో ఒకటి, కమాన్‌పూర్ మండలంలో 5 పనులు, మంథని మండలంలో 18 పనులు, ముత్తారం మండలంలో 18 పనులు, రామగిరి మండలంలో 10 పనులు, ఎలిగేడు మండలంలో 12 పనులు, జూలపల్లి మండలంలో 13 పనులు, ఓదెల మండలంలో 14 పనులు, పెద్దపల్లి మండలంలో 19 పనులు, కాల్వశ్రీరాంపూర్ మండలంలో 5 పనులు, సుల్తానాబాద్ మండలంలో 12 పనులు, ధర్మారం మండలంలో 32 పనులను గుర్తించి నిధులు మంజూరు చేశారు. ఏప్రిల్ 8వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సమయంలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో పనులు చేసేందుకు ఎవరు ముందుకు రాలేదు. ఎలాగైనా పనులు చేయించాలంటూ కింది స్థాయి అధికారులపై ఒత్తిడి తీసుక వచ్చారు. దీంతో మండల పంచాయతీ అధికారులు మాజీ సర్పంచులు, చిన్న చిన్న పనులు చేసే కాంట్రాక్టర్లు, పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి పెంచి పనులు చేసేలా ఒత్తిడి తీసుక వచ్చారు. అగ్రిమెంట్లు లేకున్నా కూడా తాగునీటి ఎద్దడి లేకుండా చూడడం తక్షణ అవసరం కావడంతో పనులు చేశారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీన ముగిసిన వెంటనే ఈ పనులకు సంబంధించి ప్రొసీడింగ్స్ జారీ చేసి పనులు చేసిన వారితో అగ్రిమెంట్లు చేసుకుని, ఎంబీ రికార్డులు చేసి బిల్లులు చెల్లించాల్సిన అధికారులు జాప్యం చేశారని తెలిపారు. చేసిన పనులకు బిల్లులు వస్తాయో, లేదోనని ఆందోళన చెందుతున్న క్రమంలో ఎట్టకేలకూ జూలై 4వ తేదీన మిషన్ భగీరథ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అగ్రిమెంట్లు చేసుకున్నారు. ఎంబీ రికార్డులు దాదాపు మొత్తం పూర్తిచేసినా కూడా బిల్లులు చెల్లించడంలో మిషన్ భగీరథ ఇంట్రా విలేజ్ అధికారులు తాత్సారం చేస్తున్నారని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. కార్యాలయానికి వెళితే ఇప్పుడు, అప్పుడు అని చెబుతున్నారే గానీ బిల్లులు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ సత్వరమే స్పందించి తాగునీటి ఎద్దడి నివారణ పనుల బిల్లులు ఇప్పించాలని కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులు, తదితరులు కోరుతున్నారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' మిషన్ భగీరథ ఇంట్రా విలేజ్ ఈఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా, ఎంబీ రికార్డులు పూర్తయ్యాయని, నాబార్డు పనుల బిజీలో ఉన్నామని అక్టోబర్ మొదటి వారంలో బిల్లులు పూర్తి చేస్తామని చెప్పారు.

ఉచిత అకాడా శిక్షణా తరగతులు ప్రారంభం



అకాడా శిక్షణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

జ్యోతినగర్, సెప్టెంబరు 25 : ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలోని విశ్వభారతి పాఠశాలలో బుధవారం హనుమాన్ అకాడా ఆధ్వర్యంలో ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌షింగ్ రాజ్‌ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరై అకాడా శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాతనమైన అకాడా కళను ప్రోత్సహిస్తున్న హనుమాన్ అకాడా నిర్వాహకులను అభినందించారు. విద్యార్థులు తమ స్వీయరక్షణకు సంబంధించి అకాడా నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వభారతి విద్యా సంస్థల చైర్మన్ బందారుపు యాదగిగౌడ్, హనుమాన్ అకాడా నిర్వాహకుడు కంది నాగరాజు, కంది చంద్రయ్య, కంది ఆంజనేయులు, కంది సాగర్, ముత్యాల సాయిరాం, కంది రణధీర్, కీర్తన, కార్పొరేటర్ మహంకాళి స్వామి, మహేశ్, మచ్చకుర్తి రమేష్, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

మంథని, సెప్టెంబర్ 25: అక్టోబర్ మాసాంతం వరకు పంచాయతీల్లో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన డివిజన్ స్థాయి పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు పంచాయతీల్లో చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి కంపోస్టు ఎరువును తయారీ చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సంబంధిత యాప్ ద్వారా సర్వే నిర్వహించి త్వరగా పూర్తి చేయాలన్నారు. కరెంటు బిల్లులు, పంచాయతీ మల్టీపర్పస్ సిబ్బంది వేతనాలు సకాలంలో చెల్లించాలని, నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డీఎల్‌పీవో సతీష్ కుమార్, ఎంపీడీవో పూర్ణచందర్, అధికారులు రాఘవులు, రేణుక, శేషయ్యసూరి, కిరణ్, ఉమేష్, భాస్కర్‌లు పాల్గొన్నారు.

వైద్యులు, వైద్య విద్యార్థుల ర్యాలీ

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 25: వరల్డ్ పేషెంట్ సేఫ్టీ దినోత్సవం సందర్భంగా బుధవారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి మెడికల్ కళాశాల వరకు వైద్యులు, వైద్య విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందు మాట్లాడుతూ రోగులకు జబ్బులు వస్తే వారికి వెంటనే టెస్టులు నిర్వహించి వచ్చిన జబ్బులను నయం చేయడానికి వైద్యులు, వైద్య సిబ్బంది శ్రమిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అనంతబాబు, ఓబులేష్, హర్షిణి, పీఆర్‌ఓ కృష్ణ, నాగరాజు, శివతో పాటు వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం వయో వృద్ధుల వారోత్సవాలు నిర్వహించాలి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 25: షెడ్యూల్ ప్రకారం వయో వృద్ధుల వారోత్సవాల నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ వయోవృద్ధుల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. వయో వృద్ధుల వారోత్సవాల షెడ్యూల్, చేపట్టే కార్యక్రమాలను జిల్లా సంక్షేమ అధికారి కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ అక్టోబర్ 1న అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 25 నుంచి అక్టోబర్ 1వరకు వారోత్సవాలను సజావుగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, సూపరింటెండెంట్ కే రాజయ్య, వయో వృద్ధుల కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎంపీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 25: జిల్లా ఉద్యమకారుల సన్మాన కార్యక్రమ పోస్టర్, చరిత్ర పుస్తకాన్ని బుధవారం ఎంపీ వంశీకృష్ణ ఆవిష్కరించారు. ఈనెల 27న హైదరాబాద్ హరిహర కళాభవన్‌లో జరిగే ఉద్యమకారుల ఘన సన్మానానికి రావాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్, జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని, ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కంకటి శ్రీనివాస్, డాక్టర్ మంద భాస్కర్ యాదవ్, కుమ్మరియాదవ్, నూనేటి సంతోష్, రౌతు సందీప్, సమసదయ్య, కందుల సదాశివ్, జనగామ రవి, పాలకాని కనుకయ్యయాదవ్, కాల్వల రవీందర్ పాల్గొన్నారు.

దళిత వర్గాల కోసం పోరాడిన రాజారాం

మంథని, సెప్టెంబర్ 25: దళిత వర్గాల అభ్యున్నతి కోసం బోగె రాజారాం పోరాడిన తీరు అందరికి ఆదర్శమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. రాజారాం వర్ధంతి సందర్భంగా బుధవారం జరిగిన సమావేశంలో ఆయన చిత్రపటానికి వంశీకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజారాం కుటుంబానికి అండగా ఉంటామన్నారు. దళిత, అంబేద్కర్ సంఘాల నేతలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 25: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాక మహేష్, ప్రధాన కార్యదర్శి సావనపల్లి వెంకటస్వామి, పెద్దపల్లి, రామగుండం,మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలో నాయకులు, బొంకూరి సాగర్, ఆరేపల్లి చంద్రయ్య, కుక్క అన్వేష్, సుద్దాల సతీష్, నాగమణి, సారయ్య, కిషన్ నాయక్, సురేష్, లక్ష్మణ్, రాధాకిషన్, చందు, గట్టయ్య మల్లేష్‌తోపాటు కార్మికులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

గోదావరిఖని, సెప్టెంబరు 25: గోదావరిఖనిలోని సింగరేణి మెడికల్ కళాశాలలో మెడికల్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చందర్ ఆధ్వర్యంలో బుధవారం చౌరస్తాలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన ఆసుపత్రిలో మరిన్ని వైద్య సేవలు

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



కంటి శస్త్ర చికిత్స విభాగాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 25:రానున్నరోజుల్లో జిల్లా ప్రధాన ఆసుపత్రిలో మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. జిల్లా ఆసుపత్రిలో కలెక్టర్ శ్రీకోయ హర్షతో కలిసి మాతాశిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో ఏర్పాటుచేసిన కంటి శస్త్ర చికిత్స విభాగం, పోలీస్ ఔట్‌పోస్టు, డెంటల్ విభాగంలో పరికరాలు, చిన్నపిల్లల వైద్య విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ప్రారంభించుకున్న నూతన పరికరాలు, విభాగాల ద్వారా మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. ఆర్థోపెడిక్, కంటి శస్త్రచికిత్స, డెంటల్ విభాగం, చిన్నపిల్లల వైద్య సదుపాయాలు అందుబాటులోకి తెచ్చామని వీటిని ప్రజలు సంపూర్ణంగా వినియోగించుకోవాలన్నారు. జిల్లా ఆసుపత్రిని 150 పడకల ఆసుపత్రికి పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. పేషెంట్లకు మెరుగైన చికిత్సను అందించాలని, పరిశుభ్రత విషయంలో జాగ్రత్తలు వహించాలని ఆసుపత్రి సువరింటెండెంట్ శ్రీధర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఆర్ఎంవో డాక్టర్ రవీందర్, సంబంధిత వైద్య అధికారులు, పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 25: మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్, దాసరి మమతరెడ్డి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో పలు అభివృద్ధి పనులపై ఎజెండాను రూపొందించి కౌన్సిల్ ముందు ఉంచారు. అలాగే అన్ని వార్డుల్లో చేయాల్సిన పనులపై చర్చించారు. మొత్తం 18 అంశాలపై కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ నజీమిన్ సుల్తానామోబిన్, కౌన్సిలర్లు, నూగిళ్ళ మల్లయ్య, భూతగడ్డ సంపత్, అమ్రీష్, రాజం మహంత, రమాదేవి, కల్పన, సోని, బిక్షపతి, భాగ్యలక్ష్మి, ఉప్పు స్వరూప కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించండి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 25: ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వైద్యులకు సూచించారు. బుధవారం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు మందుల కొరతగానీ, ఇతర ఏ సమస్యలు లేకుండా చూడాలన్నారు. స్టాఫ్ క్వార్టర్ల స్థానంలో టీబీ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని, దానికి వెంటనే మరమ్మతులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఐసీయూ, పోస్ట్ ఆపరేటివ్ వార్డులోని రినవేషన్ పనులను వేగవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రికి ప్రత్యేకంగా ప్రసూతి ఇన్సెంటివ్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్టు, గర్భిణీలకు ప్రసూతి సమయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. పాత భవనం, కొత్త భవనం రెండు బ్లాకుల మధ్య తక్షణమే రోడ్డును ఏర్పాటు చేసి లైటింగ్ సౌకర్యం కల్పించాలని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలను తయారు చేయాలన్నారు. తరచూ ఆసుపత్రిలో విద్యుత్ సమస్యలు తెలెత్తుతున్న నేపథ్యంలో ప్రత్యేక ఫీడర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలు లేకుండా చేయాలని, ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, ఆర్ఎంఓలు అప్పారావు, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో పోలీస్ డ్యూటీ మీట్ ప్రారంభం



పోలీస్ డ్యూటీ మీట్‌లో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, సెప్టెంబరు 25: రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల్ జోన్ పోలీస్ అధికారులకు, సిబ్బందికి బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీ ఎం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సీపీ మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన వారు అక్టోబర్ 4న నిర్వహించే కాళేశ్వరం జోన్ స్థాయి పోలీస్ డ్యూటీకి ఎంపికవుతారని, ఆరోజు ఎంపికైన వారు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే డ్యూటీ మీట్‌కు ఎంపిక చేస్తామన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అధికారులు, సిబ్బంది జోన్ స్థాయిలో, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి రామగుండం కమిషనరేట్‌కు మంచిపేరు తీసుకురావాలని సీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ, సీసీఎస్ ఏసీపీ వెంకటస్వామి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సురేంద్ర, ఆర్ఐలు దామోదర్, వామనమూర్తి, సంపత్ మల్లేశం, శ్రీనివాస్, కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది, బీడీ టీం, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

28న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి : సీపీ

గోదావరిఖని, సెప్టెంబరు 25: కక్షలు, గొడవలతో ఏం సాధించలేమని, ఏ వివాదాలు, కేసులోనైనా రాజీ మార్గమే రాజమార్గమని, రాజీ పడితే ఇద్దరూ గెలిచినట్టేనని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. 28న జాతీయ లోక్ అదాలత్ జరగనున్న దృష్ట్యా కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందన్నారు. రాజీపడదగిన కేసులలో క్రిమినల్, కాంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తివిభజన కేసులు, కుటుంబపరమైన నిర్వహణ, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్‌చౌర్యం, చెక్‌బౌన్స్ తదితర రాజీ పడదగిన కేసుల్లో కక్షిదారులు రాజీపడాలని సూచించారు. రాజీమార్గం రాజమార్గమని, చిన్నచిన్న కేసుల్లో కక్షలు పెంచుకొని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేయవద్దని పేర్కొన్నారు. జ్యుడిషియల్ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీస్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, సిబ్బంది రాజీపడదగ్గ కేసులను గుర్తించి ఇరువర్గాలను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించి రాజీపడేటట్టు అవగాహన కల్పించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని సీపీ పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 25 : మండలంలోని మారేడుగొండ, గుర్రాంపల్లి గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను బుధవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పరామర్శించారు. వెంట కాంగ్రెస్ నాయకులు గోపగాని సారయ్యగౌడ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

పెద్దపల్లి రూరల్ : మండలంలోని రాఘవపూర్‌లో గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

సింగరేణి కార్మికులకు నికర లాభాల్లో వాటా చెల్లించాలి

- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

గోదావరిఖని, సెప్టెంబరు 25: సింగరేణి కార్మికులకు సంస్థ నికర లాభాల్లో 33శాతం చెల్లిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించిన విధంగా కార్మికులకు చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేటీఆర్ వ్యాఖ్యలపై మక్కాన్‌సింగ్ విమర్శించడాన్ని చందర్ తీవ్రంగా ఖండించారు. కేటీఆర్‌ను విమర్శించే నైతిక హక్కు, స్థాయి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు లేదని ఆయన అన్నారు. సింగరేణి కార్మికుల వస్త్ర దారణతో తట్ట చెమ్మాస్ పట్టుకుని అసెంబ్లీకి వెళ్లిన మక్కాన్‌సింగ్ ఆ కార్మికుల సంక్షేమం కోసం పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు హయాంలో సింగరేణి కార్మికుల వారసత్వ హక్కులను తీసేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని కొనసాగించిందని, కారుణ్య నియామకాల పేర సింగరేణి కార్మికుల పిల్లలకు డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించిందని కేసీఆర్ ప్రభుత్వమని చందర్ చెప్పారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో సింగరేణికి స్వర్ణయుగమని ఆయన పేర్కొన్నారు. లాభాలకు అనుగుణంగా కార్మికుల వాటా శాతాన్ని పెంచింది కూడా కేసీఆరేనని పేర్కొన్నారు. రామగుండం ఎమ్మెల్యేకు కార్మిక ఉద్యమాలు తెలియవని, ఏ కార్మిక ఉద్యమంలో పాల్గొన్న చరిత్ర మక్కాన్‌సింగ్‌కు లేదని ఆరోపించారు. సింగరేణి నికర లాభాల్లో కార్మికులకు 33శాతం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు 33శాతం లాభాలు సాధించే విషయంలో టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న నిరసన కార్యక్రమాలను అణచివేసేందుకు ప్రభుత్వం చేస్తున్న పోలీస్ చర్యను ఖండించారు. ఎన్ని బెదిరింపులు చేసినా, అక్రమ కేసులు పెట్టినా ఊరుకునేది లేదని, కార్మికులకు నికర లాభాల్లో 33శాతం సాధించే వరకు పోరాడుతామన్నారు. తెలంగాణ ఉద్యకారులకు కేసులేమి కొత్త కాదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు పాముకుంట్ల భాస్కర్, ఐత శివకుమార్, కృష్ణవేణి, అంజలిదేవి, గాదం విజయ, నాయకులు మురళీధర్ రావు, మెతుకు దేవరాజ్, నూతి తిరుపతి, చల్లగురుగుల మొగిలి, బొడ్డుపెల్లి శ్రీనివాస్, అడప శ్రీనివాస్, జాహిద్ పాషా, పీచర శ్రీనివాస్, ఇంజపురి నవీన్ పాల్గొన్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తల క్షేత్రస్థాయి పర్యటన

● వరిలో తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

గంగాధర, సెప్టెంబరు 25: వరి గొలక దశలో ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారుల సిఫారసుతో మందులు పిచికారి చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ అన్నారు. బుధవారం గంగాధర మండలం నారాయణపూర్, కురిక్యాల, గట్టుబూత్కుర్ గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, డీఏవో, ఏడీఏలు వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో ఎక్కువగా బ్యాక్టీరియా, ఎండు తెగులు, దోమపోటు, కంకినల్లి, పాము పొడ తెగులు, సన్న రకం వరికి ఆకునల్లి, కంకినల్లి సోకుతున్నట్లు గుర్తించి రైతులకు తగిన సహాలు, సూచనలు అందించారు. పూత దశలో ఉన్న వరికి కాపర్ సంబంధిత మందులు వాడరాదని సూచించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, ఏఈవోలు గోపీచంద్, వెంకటస్వామి, వంశీధర్, రమ్య పాల్గొన్నారు.



వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

పొంచి ఉన్న ప్రమాదం



రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న చెట్టు

శంకరపట్నం, సెప్టెంబరు 25: శంకరపట్నం మండలం జాతీయ రహదారి నుంచి మొలంగూర్ గ్రామంలోకి వెళ్లే దారిలో కావేరి సీడ్ ప్లాంట్ సమీపంలో రోడ్డు పక్కన ఎండిన చెట్టు ప్రమా దకరంగా ఉంది. ఆ చెట్టు విరిగి పడితే రోడ్డుపై వెళ్లే ప్రజలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ప్రమాదం సంభవించక ముందే చెట్టును తొలగించా లని ప్రజలు కోరుతున్నారు.

పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలి

గంగాధర, సెప్టెంబరు25: దీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తముల తిరుపతి డిమాండ్ చేశారు. బుధవారం గంగాధర ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ సీనియారిటీ గల ఎస్టీటీలకు గత జీవోలను సవరించి బీఈడీ అర్హత ఉన్న వారికి పదోన్నతి కల్పించాలన్నారు. సంవత్సరకాలంగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవు, మెడికల్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ నివేదికను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కిషన్‌రెడ్డి, పెరుక నర్సయ్య, జిల్లా నాయకులు సముద్రాల అంజయ్య, గంగాధర మండల నాయకులు పాల్గొన్నారు.

వెంటాడిన విషాదం

- అనారోగ్యంతో కుటుంబ పెద్ద మృతి
- మృతదేహాన్ని ఇంటికి తీసుకురానివ్వని ఇంటి ఓనర్
- గ్రామ శివారులోనే మృతదేహం
- గ్రామస్థుల సాయంతో అంత్యక్రియలు పూర్తి



మృతుడి కూతుళ్లకు ఆర్థిక సహాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కోట లక్ష్మణ్ (ఫైల్)

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబరు 25 : ఇంటి పెద్దాయన కష్టం చేస్తే తప్ప కడుపు నింపని ఆ కుటుం బంపై విధి పగబట్టింది. హుజూరాబాద్ మండలం ధర్మరాజుపల్లి గ్రామానికి చెందిన కోట లక్ష్మణ్(55), ప్రేమలత దంపతులు గ్రామంలోని ఓ అద్దె ఇంట్లో ఉంటూ కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉండగా వివాహం చేశారు. మంగళవారం లక్ష్మణ్ అకస్మాతుగా కిందపడిపోయాడు. గమనించిన భార్య గ్రామస్థుల సహకారంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. మెదడులో రక్తం గడ్డ కట్టడంతో మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకొస్తున్న క్రమంలో ఇంటి యజమాని మృతదేహాన్ని తీసుక రావద్దంటూ ఆదేశించడంతో గ్రామ శివారులో మృతదేహాన్ని ఉంచారు. అంత్యక్రియలు చేసేందుకు కూడా చేతిలో డబ్బులు లేక భార్య ప్రేమలత దిక్కుతోచని స్థితిలోకి వెళ్లింది. మృతుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు గ్రామస్థులందరూ ముందుకు వచ్చి తలాకొంత పోగుచేసి రూ. 80వేల ఆర్థికసాయం అందించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అంత్యక్రియల కోసం కాంగ్రెస్ నాయకుల ద్వారా ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబానికి అండగా నిలిచారు.

రూ.7,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 25: జమ్మికుంట వ్యవ సాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తిధర రూ.7, 600 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 30 మంది రైతులు 149 క్వింటాళ్ల విడి పత్తి, 11 మంది రైతులు 154క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,600, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

అంతర్జాతీయ క్రికెట్ పోటీకి ఎంపిక

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 25 : మారుమూల పల్లె నుంచి అంతర్జాతీయ క్రికెట్ పోటీకి అండర్ 19 విభాగంలో యువకుడు ఎంపికయ్యాడు. మండలంలోని ఎదులపూర్ గ్రామానికి చెందిన బోల్లా సాహితికుమార్, హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్నాడు. క్రికెట్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ప్రతిభను గుర్తించిన ఎంఎస్‌సీ క్రికెట్ అకాడమీ హైదరాబాద్ వారు అండర్ 19విభాగంలో అక్టోబర్ 20 నుంచి 29వరకు శ్రీలంకలోని కొలంబోలో జరగనున్న ఇంటర్నేషనల్ క్రికెట్ పోటీకి ఎంపిక చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముస్తాబాద్, సెప్టెంబరు 25 : మండలంలోని చిప్పలపెల్లి శివారులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఆవునూర్ ఎగువ మానేరు వాగు నుంచి ఐదు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేశామని తెలిపారు.

మృతదేహం లభ్యం

తిమ్మాపూర్, సెప్టెంబరు 25 : మండలంలోని కొత్తపల్లి మోయతుమ్మెద వాగులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఎల్ఎండీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామం వద్ద మోయతుమ్మెద వాగులో బుధవారం చుట్టి ఉన్న కవర్‌లో ఓ మృతదేహం కొట్టుకుపోతుండగా జాలర్లు గుర్తించి బయటికి తీశారు. మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్స రాల వరకు ఉంటుంది. మృతదేహం గుర్తుపట్టని విధంగా ఉండటంతో అక్కడే పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిర్వహించారు. కొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వడ్లూరి అనిల్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

- అనుమతులు లేకుండా చెట్ల నరికివేత
- పట్టించుకోని అధికారులు



జంగపల్లిలో అక్రమంగా నిలువ ఉంచిన కలప

గన్నేరువరం, సెప్టెంబరు 25 : మండలంలోని వివిధ గ్రామాల్లో అనుమతులు లేకుండా యదేచ్ఛగా చెట్లను నరికివేస్తూ కలపను అక్రమంగా రవాణా చేస్తున్నారు. కలప వ్యాపారులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే గ్రామాలలో రైతుల వద్ద చెట్లను కొనుగోలు చేసి ఇష్టారాజ్యంగా చెట్లను నరికివేసి లారీలలో లోడ్ చేసి తరలిస్తున్నారు.

జంగపల్లి గ్రామంలో స్మశాన వాటిక పక్కన పెద్ద ఎత్తున కలప నిల్వ చేశారు. ఇక్కడి నుంచి లారీలలో తరలిం చి సొమ్ము చేసుకుంటున్నారు. ఇష్టారాజ్యంగా చెట్లు నరికివేస్తూ అక్రమంగా రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఫారెస్ట్, రెవెన్యూ, పోలీసులు కలప అక్రమ రవాణాను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఒకవైపు అధికారులు హరితహారం కార్యక్రమంలో మొక్కలను నాటుతుంటే కలప వ్యాపారులు అక్రమంగా చెట్లను నరికివేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి అక్రమంగా కలప అక్రమ రవాణాను నివారించాలని కోరుతున్నారు.

చిన్న దేవాలయాల ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలి

- టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్



ఆలయ ఉద్యోగుల సంఘం సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 25 : రాష్ట్రంలో పెద్ద దేవాలయలైన వేములవాడ, యాదాద్రి, భద్రాచలం ఆలయాల మాదిరిగానే చిన్న దేవాలయాలైన కొమురవెల్లి, కొండగట్టు, బాసర దేవాలయాల ఉద్యోగులకు సైతం పీఆర్సీ అమలు చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఆలయాల ఉద్యోగుల జేఏసీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, రాష్ట్ర జేఏసీ చైర్మన్ రమేష్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ 261 జీవోను సవరించాలని, ఉద్యోగులందరికీ న్యాయం చేయాలని అన్నారు. పని గంటలతో నిమిత్తం లేకుండా అవసరానికి మించి ఉద్యోగులు పని చేశారని గుర్తు చేశారు. ఆలయాల్లో భక్తుల సంఖ్య ఎక్కువ ఉన్నందున క్యాడర్ స్ట్రెంత్ లేకపోవడంతో దేవాలయ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. క్యాడర్ స్ట్రెంత్ పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ పద్ధతిని తొలగించి అందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. 317 జీవో తీసుకొచ్చి జోనల్ వ్యవస్థలో బదిలీలు చేసి ఇబ్బందులకు గురి చేశారన్నారు. స్పౌస్‌లో కూడా ఇష్టారీతిన బదిలీలు చేశారని విమర్శించారు. వ్యవసాయ శాఖలో ఏఈవోలకు పనిభారం అధికంగా ఉందని, హాస్టల్ వెల్ఫేర్, పంచాయతీ కార్యదర్శిల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా పారిశుధ్య కార్యదర్శులను కలెక్టర్ సస్పెండ్ చేయడం సరి కాదన్నారు. ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామన్నారు.వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం, బాసర, కొమురవెల్లి, కొండగట్టు ఆలయాలకు చెందిన సుమారు 200 మంది ఉద్యోగులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన దేవాలయాల జేఏసీ కార్యవర్గం

- చైర్మన్‌గా గజవెల్లి రమేష్‌బాబు ఎన్నిక



రాష్ట్ర చైర్మన్‌గా గజవెల్లి రమేష్‌బాబు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 25 : రాష్ట్ర ప్రధాన దేవాలయాల జేఏసీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో రాష్ట్రదేవాదాయ ఉద్యోగుల జేఏసీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మారం జగదీశ్వర్, రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌గా వేములవాడ రాజన్న ఆలయ ఏఈవో గజవెల్లి రమేష్‌బాబు ఎన్నికయ్యారు. డిప్యూటీ చైర్మన్‌లుగా ఉపాధ్యాయుల చంద్రశేఖర్, బుద్ధి శ్రీనివాస్, సుదర్శన్, గౌరవ సలహాదారులుగా దయాకర్, భాస్కర్, హరికిషన్, కృష్ణ, నమిలికొండ ఉమేశ్‌శర్మ, వరి నర్సయ్య, శ్రీరాములు, వెంకటాచార్యులు, కపీంద్రా చారి, మదన్‌కుమార్, వైస్ చైర్మన్‌లుగా మల్లికార్జున్, నిరంజన్, పీచర రంగారావు, సువర్ణరా ధాకిషన్, శ్రావణ్‌కుమార్, స్వామి, సునీల్‌కుమార్, నవీన్‌శర్మ, ఎడ్ల శిసాయి, కార్యదర్శులు గా గంగా శ్రీనివాస్, కిరణ్‌కుమార్ కోశాధికారిగా సురేంద్రాచార్యులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా శ్రీధర్‌శర్మ, గోలి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులు గా కట్కూరి వెంకటయ్య, మహేష్, మాధవాచార్యులు, క్రీడల కార్యదర్శిగా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నరసింహుని ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఆలయ అధికారులు

- ఆదాయం రూ 47.70 లక్షలు

ధర్మపురి, సెప్టెంబరు 25 : ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించగా 47,70,995 రూపాయల ఆదాయం లభించింది. జూన్ 12నుంచి సెప్టెంబరు 25వరకు గల 105 రోజులకు సంబంధించిన హుండీలు తెరచి లెక్కింపు నిర్వహించగా ఈ ఆదాయం లభించింది. అలాగే 50 గ్రాముల మిశ్ర మ బంగారం, నాలుగు కిలోల 700 గ్రాముల మి శ్రమ వెండి, 90 విదేశీ నోట్లు లభించాయి. కార్యక్రమంలో దేవాదాయ కరీంనగర్ సహాయ కమిషనర్ ఎన్ సుప్రియ, ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, సీనియర్ అసిసెంట్ అలువాల శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, ఆర్య వైశ్య నిత్యాన్న సత్రం కోశాధికారి జక్కు దేవేందర్, యూబీఐ మేనేజర్ ఆశిష్ పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

జగిత్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం వరద నీరు రావడం కొనసాగింది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ఎస్సారెస్పీలోకి 33,238 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటినిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 33,238 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 18,000 క్యూసెక్కులు, రెండు వరద గేట్లు ఎత్తడం ద్వారా 6,248 క్యూసెక్కుల నీరు దిగువకు గోదావరిలోకి వదులుతున్నారు. కాకతీయ కాలువకు 6,800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా దిగువకు 1,200 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 50 క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 709 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు నుంచి ఇందిరమ్మ వరద కాలువ ద్వారా మధ్యమానేరు రిజర్వాయర్‌కు నీటిని వదులుతున్నారు.

30న హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 25: హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30న ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి బాసరవేని లక్ష్మణ్ ఓ ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో సీనియర్ బాలురు, బాలికలకు ఎంపిక పోటీలుంటాయన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 9నుంచి రంగారెడ్డిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో 30న ఉదయం 10గంటలకు అసోసియేషన్ కార్యదర్శి ఎన్ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్‌కు రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు 9441 92807, 8978995730, 9550942180 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఎల్ఎల్‌బీ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 25 : ఎస్‌యూ పరిధిలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ విద్యార్థులు పరీక్ష ఫీజుఃమునన అక్టోబరు 5లోగా చెల్లించాలని ఎస్‌యూ పరీక్షల నియంత్ర ణాధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో అక్టోబరు 9లోగా చెల్లించాలన్నారు. పరీక్షలను అక్టోబరులో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

జీవో 25 నిబంధనలు మార్చాలి

గంభీరావుపేట, సెప్టెంబరు 25 : రేషనలైజేషన్ జీవో 25ను నిబంధనలు మార్చాలని, అశాస్త్రీయమైన జీవోను అమలు చేయాలని కలెక్టర్లను పాఠశాల విద్యాసంచాలకులు ఆదేశించడాన్ని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌లో మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో 11 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు అదే విధంగా 60 మంది విద్యార్థులకు కూడా ఇద్దరే ఉపాధ్యాయులను కేటాయించాలని పేర్కొనడం అసంబంధమైన విషయమన్నారు. ఇటీవల జరిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీల్లో పాఠశాల విద్యాశాఖ పాటించిన నిబంధనలను కూడా అమలు చేయక పోవడం పట్ల మహేందర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. 317లో నష్టపోయిన వారికి సొంత జిల్లాలకు పంపాలని పెండింగ్ బిల్లులు డీఏలు మంజూరు చేయాలని పీఆర్‌సీ ప్రకటించి అమల చేయాలన్నారు. రాష్ట్ర ఈసీ మెంబర్ ఉమా బాలచందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుమాల రామానాథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కోట్యాగిరి బాల్‌రాజు, కార్యదర్శి కరికె ప్రకాష్, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

గవర్నర్ అవార్డుకు ఎంపికైన ఖని విద్యార్థులు



తృతీయ సోపాన్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 25: గోదావరిఖనిలో ఇటీవల జరిగిన స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపాన్ శిక్షణ శిబిరంలో స్థానిక జడ్‌పీహెచ్ఎస్ బాలికల పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి గవర్నర్ అవార్డుకు అర్హత సాధించారు. హర్షవర్ధన్, భానుప్రసాద్, మణిదీక్షిత్, సలీంపాషా, సాయికృష్ణ, కౌశిక్, మారుతి ఎంపికయ్యారు. తృతీ య సోపాన్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యా యులు జింక మల్లేష్, స్కౌట్ మాస్టర్ నీలిమ, ఉపాధ్యాయులు రమ, ఫిజికల్ డైరెక్టర్ కనుకుంట్ల లక్ష్మణ్, అరుంధత, మనోహర్ శాస్త్రి అభినందించారు.

క్రైం కార్నర్

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

మరొకరికి 10 ఏళ్లు జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 25 : ఓ వ్యక్తి హత్యకు కారణమైన ఇద్దరిలో ఒకరికి జీవిత ఖైదు రూ.2500 జరిమానా, మరొకరికి 10 సంవత్సరాల జైలు శిక్ష రూ.2500 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి ఎస్.ప్రేమలత బుధవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం ముస్తాబాద్‌కు చెందిన పండుగ రాజం తండ్రి రాములుకు పండుగ మరియమ్మకి ఆస్తుల పంపకాల విషయంలో గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో పండుగ రాజంను 1 సెప్టెంబరు 2020న పండుగ మరియమ్మ ఆమె కుమారుడు పండుగ మల్లేశం గొడ్డలితో నరికి చంపారు. ఈ సంఘనపై అప్పటి సిరిసిల్ల రూరల్ సీఐ సర్వర్ కేసు నమోదు చేశారు. పండుగ మరియమ్మ, మల్లేశంను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో కోర్టులో 15మంది సాక్షులను ప్రవేశ పెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సింగరావు వాదించారు. కేసు పూర్వాప రాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో పండుగ మరియమ్మకి పది సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.2500 జరిమానా, పండుగ మల్లేశంకు జీవిత ఖైదుతో పాటు రూ.2500 జరిమానా విధించారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

- రికార్డుల్లో మరో వ్యక్తి పేరిట సొంత పట్టా భూమి

గొల్లపల్లి, సెప్టెంబరు 25: మండలంలోని గుంజపడుగు గ్రామంలో తన సొంత పట్టా భూమి గ్రామానికి చెందిన మరో వ్యక్తి పేరిట రికార్డుల్లోకి ఎక్కడంతో ఓ వృద్ధుడు తీవ్ర మనస్తాపం చెంది సదరు నకిలీ పట్టాదారు ఇంటి ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చుక్క లింగయ్య (78)కు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 74లో 0-14 గుంటల వ్యవసాయ భూమి ఉన్నది. అయితే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన రెవెన్యూ రికార్డుల శుద్ధీకరణ కార్యక్రమంలో భాగంగా లింగయ్య భూమి సాంకేతిక కారణాల వల్ల గ్రామానికి చెందిన నవ్వ రమేష్ అనే వ్యక్తి పేరిట రికార్డుల్లో తప్పుగా నమోదైంది. దీనిపై లింగయ్య రెవెన్యూ కార్యాలయం చుట్టూ, రమేష్ ఇంటి చుట్టు రెండేళ్లుగా తిరుగుతున్నాడు. అయినప్పటికి అధికారులు పట్టించుకోలేదు. అసలు ఆ సర్వే నంబరులో రమేష్‌కు ఎలాంటి భూమి లేకున్నా తన భూమి అన్నట్లు వ్యవహరిస్తూ తీవ్రమానసిక క్షోభకు గురిచేస్తున్నాడని బాధిత కుటుంబసభ్యులు కన్నీళ్లపర్యంతమయ్యారు. ఈ సంవత్సరం మార్చి నెలలో ఎట్టకేలకు పట్టా చేస్తానని రమేష్ చెప్పడంతో ఆన్‌లైన్‌లో ధరణి పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకున్నారు. అయితే, మళ్లీ పట్టా చేయకుండా తప్పించుకుతిరుగుతున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన లింగయ్య పురుగుల మందు డబ్బాతో రమేష్ ఇంటికి వెళ్లి ఇంటి ముందర పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం అసుపత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తమ భూమి తమకు ఇప్పించి న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు సంబంధిత అధికారులను కోరారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో రాగి వైరు చోరీ

సుల్తానాబాద్, సెప్టెంబరు 25 : సుల్తానాబాద్ పట్టణంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో దొంగతనం జరిగింది. ఈ సంఘటన బుధవారం ఉదయం వెలుగుచూసింది. కరీంనగర్ వైపు రాజీవ్ రహదారిని ఆనుకుని శాస్త్రినగర్ ప్రాంతంలో ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో రాత్రి దొంగలు ముఖాలకు మాస్కులు ధరించి వచ్చి కేంద్రంలోని కిటికీల గుండా లోనికి ప్రవేశించారు. అందులో ఉన్న సీసీ కెమెరాల వైర్లను కట్‌చేసి దొంగతనానికి పాల్పడ్డారు. ట్రాన్స్‌ఫార్మర్లకు చెందిన మూడున్నర క్వింటాళ్ల రాగి వైరును ఎత్తుకెళ్లారు. దీని విలువ దాదాపు నాలుగు లక్షల రూపాయల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పోలీస్ అధికారులు బుధవారం సందర్శించి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఇతర ఆధారాల కోసం అన్వేషించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

- బైక్ చోరీ

ఇంటి ఎదుట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల రోడ్డులో చోటు చేసుకుంది. భైరోగని రవీందర్‌గౌడ్ అనే వ్యక్తి తన ఇంటి ఎదుట వాహనం నిలిపి ఉంచగా బుధవారం తెల్లవారి లేచి చూసేసరికి వాహనం కనిపించకుండాపోయింది. వెంటనే సీసీ కెమెరాలు పరిశీలించగా ఓ దొంగ బైక్‌ను ఎత్తుకెళుతున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి.

దొంగతనం కేసులో ఒకరికి జైలు శిక్ష

వేములవాడ, సెప్టెంబర్ 25 : యాభై వేల రూపాయల నగదు దొంగలించిన సంఘటనలో ఒకరికి 18 నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి తీర్పునిచ్చారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ బుధవారం మీడియాకు వివరించారు. గతేడాది ఆగస్టు 15వ తేదీన వేములవాడలోని మోత్కుపల్లి ఎల్లయ్య అనే వ్యక్తి షాప్‌లోని క్యాష్ కౌంటర్ నుంచి ఆదిలాబాద్ జిల్లా దండేపల్లి మండలం లక్ష్మీకాంతపురం గ్రామానికి చెందిన కాశెట్టి వెంకటేష్ 50 వేల రూపాయలు దొంగిలించాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. విచారణ అధికారి ఎస్ఐ అంజయ్య కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సీఎంఎస్ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేష్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు.. ప్రాసిక్యూషన్ తరుపున విక్రాంత్ కేసు వాధించగా పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి జ్యోతిర్మయి కాశెట్టి వెంకటేష్‌కు 18 నెలల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు సీఐ తెలిపారు.

పిడుగుపాటుతో పేలిన ట్రాన్స్‌ఫార్మర్

శంకరపట్నం, సెప్టెంబరు 25 : శంకరపట్నం మండలం అర్కండ్ల శివారులో పిడుగు ప్రభావంతో ట్రాన్స్‌ఫార్మర్ పేలింది. గ్రామస్థుల సమాచారం మేరకు మంగళవారం మధ్యాహ్నం వర్షం కురిసిన సమయంలో మెరుపులతో పెద్ద శబ్ధంతో పిడుగుపడి ట్రాన్స్‌ఫార్మర్ పేలినట్లు తెలిపారు.

జమ్మికుంట పట్టణంలో పెట్రోల్ దొంగలు

జమ్మికుంట, సెప్టెంబరు 25 : జమ్మికుంట పట్టణంలో పెట్రోల్ దొంగలు పెట్రేగి పోతున్నారు. రాత్రి వేళల్లో ఆరుబయట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్ చోరీ చేస్తున్నారు. పగలు సీసీ కెమరాలు లేని ప్రాంతాలను గుర్తిస్తూ రాత్రి వేళల్లో పెట్రోల్ చోరీకి పాల్పడుతున్నారు. నాలుగు రోజుల క్రితం పట్టణ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఒకే రోజు రాత్రి ఇరువై ద్విచక్ర వాహనాల్లోని పెట్రోల్‌ను తీశారు. సుమారు 50లీటర్ల వరకు పెట్రోల్ ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. పోలీస్‌లు రాత్రి వేళల్లో గస్తీ పెంచి, పెట్రోల్ చోరీకి పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గంజాయి అమ్మిన వ్యక్తి అరెస్ట్

- 350 గ్రాములు స్వాధీనం



అరెస్ట్ చూపుతున్న సీఐ నిరంజన్ రెడ్డి

మెట్‌పల్లి, సెప్టెంబరు 25 : దారి దొపిడీ కేసులో నిందితులకు గంజాయి అమ్మిన వ్యక్తిని బుధవారం పోలీస్‌లు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి 350 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో సీఐ వివరాలను వెల్లడించాలరు. ఈనెల 21న ఇబ్రహీంపట్నం మండలంలోని బండలింగపూర్ క్రాసింగ్ వద్ద ముగ్గురు వ్యక్తులను రెండు రోజుల క్రితం అరెస్ట్ చేసి విచారించారు. వైఎస్ఆర్ కాలనీకి చెందిన చందు వారికి గంజాయి అమ్మినట్టుగా తెలిపారు. దీంతో మెట్‌పల్లి డీఎస్పీ ఆదేశాలు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం చందు తన ఇంటివద్ద ఉన్నాడని పక్కా సమాచారం మేరకు చందు ఇంటి వద్దకు వెళ్లి పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. అతడిని విచారించగా గంజాయి అమ్మినట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న 350 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకోని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిచింనట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యహరించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్‌కుమార్, మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి, రాజును అధికారులు అభినందించారు.

పోలీసుల జోక్యంతో ముగిసిన యువకుడి అంత్యక్రియలు



జగ్గసాగర్‌లోని సమస్యను తెలుసుకుంటున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 25 : మండలంలోని జగ్గసాగర్ గ్రామానికి చెందిన ఏనుగు ప్రభాస్(19) అనే యువకుడి అంత్యక్రియలు పోలీసుల జోక్యంతో బుధవారం నిర్వహించారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన ఏనుగు ప్రతాప్, అనంతల దంపతుల కుమారుడైన ఏనుగు ప్రభాస్ మనస్తాపానికి గురై ఈనెల 8న ఆత్మహత్య పాల్పడ్డాడు. ఈనెల 24న ప్రభాస్ మృతి చెండాడు. ప్రభాస్ ఆత్మహత్యకు తల్లె కారణమని ఆమెపై గ్రామంలోని కులస్థులు దాడికి పాల్పడ్డారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. యువకుడి తల్లి పేరుపై ఉన్న ఆస్తిని తండ్రి ఏనుగు ప్రతాప్‌పై చేసి న్యాయం జరిగే వరకు అంత్యక్రియలు నిర్వహించేదిలేదని కుటుంబ సభ్యులు, కులస్థులు పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు అక్కడి చేరుకుని సమస్యను తెలుసుకున్నారు. తల్లి పేరు మీద ఉన్న ఆస్తి భర్త ప్రతాప్ పేరు రిజిస్టర్ చేస్తేనే అంత్యక్రియలు చేస్తామని పేర్కొన్నారు. పోలీసులు కలగజేసుకుని అంత్యక్రియలు జరిగిన తరువాత కుటుంబస భ్యులు, బంధువులు, కులస్థుల కలిసి సానుకూలంగా మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. సమస్యను పరిష్కరించుకోవడానికి ఎలాంటి గొడవలు జరగకుండా రక్షణ కల్పిస్తామన్నారు. దీంతో వారు శాంతించి ఆ యువకుడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

శిథిలావస్థలో మడక పశువైద్యశాల

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- భయాందోళనలో వైద్య సిబ్బంది



మడకలో శిథిలావస్థలో ఉన్న పశు వైద్యశాల

ఓదెల, సెప్టెంబరు 25 : శిథిలావస్థకు చేరి కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న మండలంలోని మడక పశువైద్యశాలను ఎవరూ పట్టించుకోవడంలేదు. 1965లో అప్పటి గ్రామ సర్పంచ్ కోట రాఘవరెడ్డి భూదానం చేసి పశు వైద్యశాలను నిర్మించారు. ఇప్పటికి 60ఏళ్లు కావస్తోంది. ఇప్పటివరకు కూడా ఎవరు మరమ్మ తులు చేపట్టకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం సిబ్బంది ఇందులోనే ఉండి పశువులకు వైద్యాన్ని అందిస్తున్నారు. వైద్యశాల పైకప్పు సగ భాగం కూలిపోయింది. వర్షం వచ్చిన సమయంలో ఇందులో ఉన్న మందులు, రికార్డులు, ఫర్నిచర్ తడిసిపోతోంది. అలాగే వైద్య సిబ్బంది భయాం దోళనకు గురై బయటనే ఉండి వైద్య సేవలందిస్తున్నారు. భవన నిర్మాణం కోసం గతం నుంచి సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులకు వినతి పత్రాలను సమర్పిస్తున్న ప్పటికీ ఏ అధికారి పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

వైద్య సిబ్బందికి పొంచి ఉన్న ప్రమాదం..

- నంద క్రాంతి, మడక



శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల సిబ్బందికి ప్రమాదక రంగా మారింది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థి తిలో ఉంది. అధికారులు స్పందించి కూల్చివేసి ఇక్కడే కొత్త భవనం నిర్మిస్తే రైతులు, సిబ్బందికి సౌకర్యంగా ఉంటుంది.

ఏడీఏకు ఆత్మీయ వీడ్కోలు

మంథని, సెప్టెంబర్ 25: మంథని డీఏడీఏగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్ళిన మురళికి ఫర్టిలైజర్స్ డీలర్లు, వ్యవసాయాధికారులు బుధవారం ఆత్మీయ సన్మానం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో డీఏవో ఆదిరెడ్డి, మంథని ఏడీ ఏ అంజలి, ఏడీఏ టెక్ కాంతారావు, సూపరిండెంట్ కరుణా కర్‌రెడ్డి, ఏవోలు మోహన్, శ్రీకాంత్, అనూష, ప్రమోద్, రామకృష్ణ, ఏఈవోలు పాల్గొన్నారు.

పెగడపల్లిలో వరి పంటల పరిశీలన

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 25: మండలంలోని పెగడ పల్లి గ్రామపరిధిలో గల వరి పంటలను మండల వ్యవసా య అధికారి నాగార్జున బుధవారం పరిశీలించారు. వరికి ఆకు ఎండు తెగులు నివారణకు సూచనలు చేశారు.

సుల్తాన్‌పూర్‌లో ఉచిత వైద్యశిబిరం

ఎలిగేడు, సెప్టెంబర్ 25 : మండలంలోని సుల్తాన్‌పూర్ లో శ్రీహర్ష కంటి ఆసుపత్రి వైద్యులు సీహెచ్ శ్రీలత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని మాజీ ఎంపీపీ తాని పర్తి స్రవంతిమోహన్‌రావు ప్రారంభించారు. మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, నాయకులు తానిపర్తి సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాసరచన పోటీలు

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 25: స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థి నులకు మున్సిపల్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వ హించారు. గెలుపొందిన వారికి చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, జూనియర్ అసిస్టెంట్ రమా కాంత్, పాఠశాల, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణకు మోక్షమెప్పుడో?

● పేరుకే పెద్ద గ్రామాలు.. ఎక్కడ చూసినా ఇరుకు రోడ్లే.. ● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఇరుకుగా ఉన్న ఓదెల జీపీ రోడ్డు



ఓదెలలో మురికికాలువ నుంచి ఎడ్లబండిని బయటకు తీస్తున్న గ్రామస్థులు(ఫైల్)

ఓదెల, సెప్టెంబరు 25 : మండలంలోని మేజర్ గ్రామాల్లో రోడ్ల విస్తరణకు నోచుకోవ డం లేదు. జనాభాతో పాటు వాహనాల సం ఖ్య కూడా పెరగడంతో ఇరుకైన వీధుల్లో రాక పోకలు ఇబ్బందికరంగా మారాయి. దీంతో చాలా సంవత్సరాలుగా ఆయా గ్రామాల ప్రజ లు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఐదు పెద్ద గ్రామాలు పేరుకే ఉన్నాయి. దశా బ్దాల తరబడి రోడ్ల విస్తరణకు నోచుకోకపోవ డంతో గ్రామాల్లో తరచుగా ప్రమాదాలు జరు గుతున్నాయి. ఓదెల, కొలనూర్, కనగర్తి, పొ త్కపల్లి, గుంపుల గ్రామాలు విస్తీర్ణంలో, జనా భాలో పెద్ద గ్రామాలుగా ఉన్నప్పటికీ, ఈ గ్రామాల్లో ప్రధాన రహదారులు మినహా ఏ వార్డు చూసినా ఒక్క వాహనం వెళితే పక్క నుంచి మరో వాహనం వెళ్లలేని పరిస్థితి. అతి కష్టం మీద రోడ్డు వెడల్పు కార్యక్రమాలు చేప ట్టి కొంత మేరకు ప్రధాన రహదారులను విశా లంగా మార్చి, నేటికి కూడా గ్రామాల్లో లోపల వీధులన్నీ మేడిపండుగానే మిగిలాయి. దీంతో ఓదెలలో వీధుల గుండా వెళ్లాలంటే ప్రమాదా లకు గురికావాల్సిందే. ఇటీవల ఓదెలలో ఓ రైతు ఎడ్ల బండి ద్వారా ధాన్యాన్ని తరలిస్తున్న క్రమంలో మురుగుకాల్వలో పడిపోయింది. దీంతో అతి కష్టం మీద గ్రామస్తులు పైకి తీసి ప్రమాదం నుంచి తప్పించారు. కొలనూర్, కన గర్తి, గుంపుల గ్రామాల్లో ఇదే పరిస్థితి. తెలం గాణ రాష్ట్ర ఏర్పాటుతో కోట్లాది నిధులు గ్రా మాల అభివృద్ధికి వెచిస్తున్నా మండలంలోని ఆయా గ్రామాల్లో ఇరుకు రోడ్ల దుస్థితి మార డం లేదు. దీంతో గ్రామాలకు ఇప్పటికీ సక్ర మంగా బస్సుల సౌకర్యం లేకపోవడం విచార కం. ఇరుకైన రోడ్లలో బస్సులు రాకపోకలు కొనసాగించకపోవడంతో ఐదు లక్షల రూపా యల వ్యయంతో నిర్మించిన ఓదెల బస్టాండ్ ఇప్పుడు పశువుల పాకగా మారిపోయింది. దీంతో ప్రస్తుతం ఎవరికి ఉపయోగం లేకుం డాపోతున్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదనే ఆరోప ణలు వినిపిస్తున్నాయి. రోడ్ల విస్తరణ ఆవశ్యక తపై ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించడంలో సంబంధిత అధికారులు విఫల మవుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. గతంలో రోడ్ల విస్తరణలో ఇండ్లు, భవ నాలు, గోడలు కోల్పోయిన వారికి కనీసం పరి హారం అందజేయకుండా కూల్చివేయడంతో ప్రస్తుతం రోడ్ల విస్తరణకు నోచుకోవడం లేదు. గ్రామాల్లో యుద్ధ ప్రతిపాదికన రోడ్ల విస్తరణ చేపట్టే ముందు నష్టపరిహారం కోసం ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులను కేటాయిస్తే, ఇరుకు రోడ్లన్నీ విశాలంగా మారే పరిస్థితి ఉంది.

ఎంఈవోల బాధ్యతల స్వీకరణ

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 25 : జిల్లాలోని 14 మండలాలకు ఎంఈవోలు బుధవారం బాధ్య తలను స్వీకరించారు. పెద్దపల్లి ఎంఈవోగా టి. సురేందర్‌కుమార్, సుల్తానాబాద్ ఎ. రాజయ్య, మంథని డి. లక్ష్మి, ధర్మారం పి.ఛాయాదేవి, ఎలిగే డు ఎ. నరేంద్రాచారి, ఓదెల వై. రమేష్, కాల్వ శ్రీరాంపూర్ ఎస్. మహేష్, జూలపల్లి కె. సరస్వతి, రామగుండం జి.చంద్రయ్య, పాలకుర్తి టి. విమల, అంతర్గాం కె. ఏకాంబార్, కమాన్‌పూర్ ఐ. విజ య్‌కుమార్, ముత్తారం ఇ. ఓదెలు, రామగిరి ఎ. కొమురయ్యలు విధుల్లో చేరారు.

కోల్‌సిటీటౌన్ : రామగుండం మండల విద్యాధి కారిగా గడ్డం చంద్రయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రామగుండంలోని మండల విద్యాధి కారి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

కమాన్‌పూర్ : మండల విద్యాధికారిగా విజయ్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు పీఆర్‌టీయూ టీఎస్ శాఖ తరఫున ఎంఈ వోను సన్మానించారు. ఏఎంవో డాక్టర్ పీఎం షేక్, సీఎంవో అజీమ్, మండలాధ్యక్షుడు గనిగంటి రమే ష్, ప్రధానకార్యదర్శి వేగోళం సత్యనారాయణగౌడ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రాజమౌళి, ఉపాధ్య క్షులు రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఓదెల : మండల విద్యాధికారిగా కనగర్తి దాసరి పద్మ హనుమయ్య హైస్కూల్ హెచ్ఎం వై. రమేష్‌ను నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బుధవారం ఎంఈవోగా రమేష్ బాధ్యతలు చేపట్టారు. ఎస్‌టీయూ, పీఆర్‌టీయూ మండల శాఖల ఆధ్వర్యంలో ఎంఈవోను సన్మా నించారు. ఎస్టీయూ నాయకులు మహేం దర్‌రెడ్డి, సురేష్, రామారావు, టీఆర్‌టీయూ నాయకులు వెంకటరెడ్డి, రజాక్, రమేష్, భద్రయ్య, ఏసుదాసు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : జడ్‌పీహెచ్ఎస్ కూనారంలో ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న సిరిమల్లె మహేష్ మండలం విద్యాధికారిగా బుధ వారం బాధ్యతలు చేపట్టారు. ఎంఈవోను ఉపా ధ్యాయులతో పాటు ఎంఆర్‌సీ సిబ్బంది రమేష్, సుంకరి రమేష్, సీఆర్‌పీలు చందర్, వీరయ్య, కు మార్, చంద్రకళ, సంపత్ సన్మానించారు.

క్యాంటీన్ ప్రారంభం

కోల్‌సిటీ, సెప్టెంబరు 25: రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసి న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను మేయర్ బంగి అనిల్‌కుమార్‌తో కలసి బుధవారం మక్కా న్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రారంభించారు. కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేష్, నాయకులు పాతపెల్లి ఎల్లయ్య, పెద్దెల్లి ప్రకాష్, నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ రాజలింగు, ఈఈ రామన్, డీఈలు జమీల్, హన్మంతునాయక్ ఆర్ఐ శంకర్‌రావు, మెప్మా డీఎంసీ ఊర్మిళ, సిఓలు శ్వేత, స్వరూప, స్వప్న, సీఎల్ఆర్ పి కవిత, నగర పాల క సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 25: మండలానికి నూతనం గా తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎండీ వకీల్, డిప్యూటీ తహసీల్దార్ శంకర్‌లను సింగిల్ విండో చైర్మన్ చదువు రామచంద్రా రెడ్డి ఘనంగా సన్మానించారు. సింగిల్ విండో సొసైటీ వైస్‌చైర్మన్ కామిడి సంధ్య వెంకట్‌రెడ్డి, డైరె క్టర్ గాజనవేన సదయ్య, సీఈఓ కోలేటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మాదాసు సతీష్ ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న హెచ్ఎంకు సన్మానం

కమాన్‌పూర్, సెప్టెంబర్ 25 : బదిలీపై వెళ్తున్న మండ లంలోని రాజాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం చొప్పరి తిరుపతిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. పీ ఏసీఎస్ చైర్మన్ లలిత, ఉపాధ్యాయులు ఉన్నారు.

మొక్కలు నాటిన మాజీ సర్పంచ్

ఓదెల, సెప్టెంబరు 25: మండల కేంద్రంలోని హైస్కూల్ లో బుధవారం మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ మొక్క లు నాటారు. హెచ్ఎం పద్మ, విద్యా కమిటీ మాజీ చైర్మన్ ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కమాన్‌పూర్, సెప్టెంబర్ 25 : మండలంలోని నాగారంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు శ్రీనివాస్ తల్లి, మండల కేం ద్రంలోని వార్డు మెంబర్ పోతుల కుమార్ తండ్రి ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాలను పెద్దపల్లి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి పరామర్శించారు.

పెద్దకల్వలలో పొలంబాట

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 25 : మండలంలోని పెద్ద కల్వలలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట నిర్వహిం చారు. ఎస్ఈ బోంకూరి సుదర్శన్ హజరై పలు పంటపొ లాల వద్ద విద్యుత్ మోటార్ల పనితీరును పరిశీలించారు.

నేడు ఆలయాల్లో హుండీల లెక్కింపు

మంథని, సెప్టెంబరు 25: స్థానిక శ్రీమహాలక్ష్మి, శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయాల్లో గురువారం హుండీల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఎండోమెంట్ ఈవో రాజ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఉదయం 10:30 గంటలకు శ్రీమహాలక్ష్మి ఆలయంలో, మధ్యాహ్నం 12:30గంటలకు శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో హుండీలను లెక్కించన్నుట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'ధర్నాను విజయవంతం చేయండి'

జ్యోతినగర్, సెప్టెంబరు 25: ఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 30న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మహాధర్నాను కార్మికవర్గం విజయ వంతం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్ కోరారు. చలో హైదరాబాద్‌కు సంబంధించి బుధవారం ఎన్టీపీసీ ఇఫ్టూ కార్యాలయంలో పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం శంకర్ ప్రసంగిస్తూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదన్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి 4 లేబర్ కోడ్‌లను ఎన్‌డీఏ సర్కారు తీసుకువస్తోందన్నారు. ఎన్నో హామీలిచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని శంకర్ డిమాండ్ చేశారు. మహా ధర్నాలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.బుచ్చయ్య, డి.రాజేశం, ఆర్.రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి కళోత్సవాలు ప్రారంభం



నృత్యాలు చేస్తున్న విశ్వభారతి పాఠశాల విద్యార్థులు

జ్యోతినగర్, సెప్టెంబరు 25: ఎన్టీపీసీలోని విశ్వభారతి పాఠశాలలో బుధవారం మండల స్థాయి కళోత్సవాలు ప్రారంభమయ్యాయి. మండల విద్యాధికారి గడ్డం చంద్రయ్య ముఖ్య అతిథిగా హాజరై కళోత్సవాలను ప్రారంభించారు. ఈ కళోత్సవాలలో ఓరల్ మ్యూజిక్, ఇన్‌స్ట్రుమెంట్ మ్యూజిక్, మైమ్, డ్యాన్స్, డ్రాయింగ్, స్టోరీ టెల్లింగ్ అంశాలలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రామగుండం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంపల్లి శ్రీనివాస్, మండల కళోత్సవాల ఆర్గనైజర్ (ఉపాధ్యాయుడు) గడ్డం జగదీశ్వర్, విశ్వభారతి విద్యాలయాల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

'మాజీ ఎంపీటీసీ భర్తపై చర్యలు తీసుకోవాలి'

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 25 పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ మాజీ ఎంపీటీసీ భర్త మిట్టపల్లి వేంకటేశంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మహనీయుల ఆశయ సాధన సమితి అధ్యక్షులు బొంకూరి కైలాసం డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ కారుపాకల సంపత్ కుమార్, ఏరుకొండ రమేష్‌లకు కల్వల శంకర్ భూమి ఆక్రమణతో సంబంధం లేదన్నారు. మిట్టపల్లి వెంకటేశం దురుద్దేశంతో రెండు వర్గాల మధ్య చిచ్చుపెడుతూ బీసీలపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. వెంకటేశం మానసికంగా వేధిస్తున్నాడని సంపత్ కుమార్, రమేష్ తమను ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో అంబాల నరేష్, కారుపాకల సంపత్, ఏరుకొండ రమేష్ పాల్గొన్నారు

28న యోగా బోధకుల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 25: తెలంగాణ ప్రభుత్వ ఆసుపత్రిలో యోగా బోధకుల పోస్టుల భర్తీలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 90 పోస్టులను భర్తీ చేయనున్నట్లు పెద్దపల్లి ఆయుష్ శాఖ జిల్లా ఇంచార్జి డాక్టర్ అరుణ, పెద్దపల్లి డిపిఎం విద్యాసాగర్ తెలిపారు. ఇందులో పెద్దపల్లి జిల్లాలో 10 మంది పురుషులు, 10 మంది స్త్రీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ పోస్టుల భర్తీకై ఇంటర్వ్యూను కరీంనగర్ రామనగర్‌లోని ఆయుష్ ఆయుర్వేద ఆసుపత్రిలో ఈనెల 28 శనివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు కనీస అర్హత పదవ తరగతి లేదా ఇంటర్మీడియట్‌తో పాటు మినిమం ఆరు నెలల యోగా సర్టిఫికెట్ ఉండాలని, అభ్యర్థులు 45 సంవత్సరంలోపు ఉండి యోగా నైపుణ్యాన్ని కలిగి ఉండాలని వారు చెప్పారు. ఈ యోగా బోధకుల పోస్టులు పార్ట్ టైం విధానంలో భర్తీ చేయనున్నట్లు చెప్పారు.

జిల్లా స్థాయి కళోత్సవాలకు విద్యార్థుల ఎంపిక

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 25: కళోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో విద్యార్థులకు ఆయా కళల పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో క్లాసికల్ డాన్స్ మొదటి బహుమతి ఎస్ శృతి, ఏ తన్మయశ్రీ వెన్నంపల్లి ఉన్నత పాఠశాల, జానపద నృత్యం రెండవ బహుమతి రుతిక బృందం వేన్నంపల్లి సాధించారు. పాటల పోటీలు మొదటి బహుమతి టీ కరుణశ్రీ కాల్వశ్రీరాంపూర్ ఉన్నత పాఠశాల, చిత్రలేఖనంలో యూ కార్తీక్, బీ చరణ్, ఎండీ రుమానుద్దీన్, కాల్వ శ్రీరాంపూర్ ఉన్నత పాఠశాల బహుమతులు సాధించారు. కుట్లు, అల్లికలు విభాగంలో సహస్రవర్ధిని జెడ్‌పీహెచ్ఎస్ వెన్నంపల్లి మొదటి బహుమతి సాధించారు. విద్యార్థులు జిల్లా స్థాయిలో ఈనెల 27, 28తేదీల్లో జరిగే పోటీలకు ఎంపికైనట్లు ఎంఈఓ మహేష్ తెలిపారు.

జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన ఐపీఎస్ స్కూల్ విద్యార్థులు

సుల్తానాబాద్, సెప్టెంబరు25: సుల్తానాబాద్ మండలంలోని రేగడి మద్దికుంటలో ఈనెల 23న జరిగిన జోనల్ స్థాయి క్రీడా పోటీలలో స్థానిక సెయింట్ మేరీస్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటుకుని బహుమతులు అందుకున్నారు. కబడ్డీ వాలీబాల్ పోటీలలో వీరు అత్యున్నతమైన ప్రతిభను చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ ఫాదర్ కాసు షౌరెడ్డి అంటూ వారిని అభినందించారు. అలాగే స్థానికి ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు కూడా ఈ జోనల్ పోటీల్లో ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని కరస్పాండెంట్, పిన్సిపాల్ మాటేటి సంజీవ్ కుమార్, కృష్ణప్రియలు తెలిపారు.

పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 25: సమాజంలో నెలకొన్న అసమానతలను రూపుమాపిన వ్యక్తి పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేరుగు హన్మంతుగౌడ్, క్యాతం వెంకటరమణ అన్నారు. దీన్‌దయాల్ 108వ జయంతి సందర్భంగా కళ్యాణ్‌నగర్‌లోని లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో జరిగిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుల్లో ఒకరిగా మానవత వాదాన్ని ప్రదర్శించారన్నారు. నితిన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోడూరి రమేష్, రాజ్‌కుమార్, అజయ్‌కుమార్, శివరతన్, హేమంత్ ఇనాని, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

'మహమ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయం'

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 25: మహమ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయమని జామాతె ఇస్లామిక్ హింద్ అధ్యక్షురాలు నబీర, అధ్యక్షుడు మెహరాజ్ అహ్మద్ అన్నారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముస్లింల కోసమే కాకుండా సర్వమానవాళికి రాజమార్గం చూపేందుకు ప్రవక్త ప్రయత్నించారని అన్నారు. ఆయన బోధనలు మానవాళికి దిశానిర్దేశం చేశాయన్నారు. ఈనెల 30వరకు జరగనున్న ప్రచార ఉద్యమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఇస్మాయిల్, ఫయాజుద్దీన్, హమీద బేగం, ఆయేష సిద్ధిక్, సాబీరా నాజ్, అహ్మద్‌పాషా, ఫయాజ్, ఖాజామొయినోద్దీన్, అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

జీఎం కార్యాలయాల ఎదుట టీబీజీకేఎస్ ధర్నా



ఆర్జీ-1 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న టీబీజీకేఎస్ శ్రేణులు



ఆర్జీ-2 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న టీబీజీకేఎస్ శ్రేణులు

గోదావరిఖని, సెప్టెంబరు 25: సింగరేణి కార్మికులకు చెల్లించనున్న లాభాల వాటాలో కుట్రపూరిత చర్యలకు పాల్పడుతున్నారని టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆర్‌జీ-1 జీఎం కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వ హించారు. కార్మికులకు నికర లాభాలపై 33శాతం వాటా ఇచ్చేవరకు అందోళనలు విరమించేది లేదని టీబీజీకేఎస్ శ్రేణులు డిమాండ్ చేశా యి. ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరు కంటి చందర్ మాట్లాడుతూ లాభాలవాటా విషయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం జరిగేవరకు పోరాడుతామని, బెదిరింపులకు భయ పడమని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి చెప్పారు. ఆర్ జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు మాదాసు రామమూర్తి, పర్లపల్లి రవి, వెంకటేష్, ప్రవీణ్, చెలుకలపెల్లి శ్రీనివాస్, రాజేశం, సత్యనారాయణ, వాసర్ల జోసఫ్, శేషగిరి, బొగ్గుల సాయి, ఉప్పులేటి తిరుపతి, కోండ్ర అంజయ్య, జనగామ మల్లేష్, లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి, అభిషేక్, కార్పొరేటర్లు కృష్ణవేణి, గాదం విజయ, సంధ్యారెడ్డి, శ్రావణ్, చింటు, రొడ్డ సంపత్, సట్టు శ్రీను పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : సింగరేణికి గత ఏడాది వచ్చిన వాస్తవ లాభా ల్లో నుంచి 33శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట టీబీజీకేఎస్ శ్రేణులు ధర్నా చేశాయి. యూ నియన్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి మాట్లాడారు. ఈ ధర్నాలో ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, ప్రభాకర్‌రెడ్డి, బేతి చంద్రయ్య, అనిల్‌రెడ్డి, సురేందర్, శ్రీనివా సరెడ్డి, మామిడి తిరుపతి, రవితేజ, దాసరి శ్రీనివాస్, వెంకటేష్, శశాంక్, లింగారెడ్డి, కొంరయ్య, నరేందర్, మహేందర్, రమేష్, నరేష్, రవి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి : సింగరేణి కార్మికులకు ప్రకటించిన లాభాల వాటా మోస పూరితంగా ఉందంటూ బుధవారం టీబీజీకేఎస్ నాయకులు జీఎం కా ర్యాలయం ఎదుట ధర్నా చేపట్టి ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు నాగెల్లి సాంబయ్య, పింగిళి సంపత్‌రెడ్డి, గిటుకు శ్రీనివాస్, కాంతారావు, వీవీ గౌడ్, సురేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్జీ-3 జీఎంకు వినతిపత్రం అందిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

నికర లాభాల నుంచే 33శాతం ఇవ్వాలి..

గోదావరిఖని, సెప్టెంబరు 25: సింగరేణి యాజమాన్యం ప్రకటించిన నికర లాభం రూ.4701కోట్ల నుంచి 33శాతం లాభాల వాటా కార్మికులకు చెల్లించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జీడీకే ఓసీపీ-5 గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. నికర లాభాల నుంచి రూ.1551కోట్లు కార్మికులకు వాటా ఇవ్వాలన్నారు. యాజమాన్యం, ప్రభుత్వంతో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు కుమ్మక్కై కార్మికులను మోసం చేస్తున్నాయన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి, నాయకులు నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, వడ్డేపల్లి శంకర్, పొలాడి శ్రీనివాసరావు, వాసర్ల జోసఫ్, సంపత్, ప్రవీణ్, సత్యనారాయణ, శంకర్, గోపి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'బెదిరింపులకు భయపడేది లేదు'

గోదావరిఖని, సెప్టెంబరు 25: బెదిరింపులకు భయపడమని, కార్మికుల కోసం చేసే పోరాటాలు విరమించమని టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసి డెంట్ మాదాసు రామమూర్తి స్పష్టం చేశారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యా యమైన కార్మికుల హక్కు కోసం తాము పోరాడుతుంటే టీబీజీకేఎస్ నాయకుల అంతు చూస్తామని బెదిరింపులకు దిగడం సరైంది కాదన్నా రు. సమావేశంలో టీబీజీకేఎస్ అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, నాయ కులు చల్లా రవీందర్‌రెడ్డి, పొలాడి శ్రీనివాస్, వాసర్ల జోసఫ్, నూతి రాజ్ కుమార్, పులిపాక శంకర్, మహిపతిరావు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారం ఐఎన్‌టీయూసీతోనే సాధ్యం

- ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

రామగిరి, సెప్టెంబరు 25: కార్మికుల సమస్యల పరిష్కారం ఐఎన్‌టీయూసీతో సాధ్యం అవుతుందని ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు అన్నారు. బుధవారం సింగరేణి ఏపీ ఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పీలో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మా ట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, డివిజన్‌లో ఐఎన్‌టీయూసీ తక్కువ సమ యంలోనే కార్మికుల అనేక సమస్యలను పరిష్కరించామన్నారు. సింగరేణి డి పెండెంట్ ఉద్యోగులకు 5 సంవత్సరాల వయస్సును పెంచినట్లు పేర్కొన్నారు. కార్మికులు మనోభావాలను గుర్తించి సింగరేణి లాభాల వాటాను 33 శాతం ఇప్పించగలిగామన్నారు. రాష్ట్రం అభివృద్ధి, సింగరేణి కార్మికుల సంక్షేమంలో ఉన్నా కొన్ని సంఘాలు ఓర్వలేక తప్పుడు విమర్శలు చేస్తున్నాయని దుయ్యబ ట్టారు. సమావేశంలో నాయకులు తిరుపతియాదవ్, రామారావు, సత్రం సమ్మ య్య, సాయికృష్ణ, మనోహర్, మహ్మద్, జుబేర్, అనీల్ పాల్గొన్నారు.

డిపార్ట్‌మెంటల్ కబడ్డీ పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 25: ఆర్జీ-2 ఏరియా వర్క్‌పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో బుధవారం డిపార్ట్‌మెంటల్ కబడ్డీ పోటీలు స్థానిక అబ్దుల్ కలాం స్టేడియంలో జరిగాయి. మొదటి మ్యాచ్‌లో డిపార్ట్‌మెంట్స్ జట్టు వకీల్‌పల్లె జట్టుతో పోటీపడగా, వకీల్‌పల్లె జట్టు గెలుపొందింది. రెండవ మ్యాచ్ లో డిపార్ట్‌మెంట్ జట్టు ఓసీపీ-3తో తలపడగా ఓసీపీ-3 జట్టు విజయం సాధిం చింది. ఫైనల్ మ్యాచ్‌లో వకీల్‌పల్లె జట్టు గెలుపొందింది.

ఆర్జీ-3లో అధికారుల పాదయాత్ర

రామగిరి, సెప్టెంబరు 25: సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీ కా లనీలో బుధవారం పరిసరాల పరిశుభ్రతపై అధికారులు పాదయాత్రను చేపట్టా రు. స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 4.0లో భాగంగా సెంటినరీకాలనీలోని మార్కె ట్‌యార్డు, పార్కు, కార్యాలయాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం పరి శీలించిన స్థలాలపై ఎస్‌వోటూ జీఎం రఘుపతి అధికారులతో సమీక్ష సమావే శం నిర్వహించారు. పరిసరాల శుభ్రత కోసం ప్రణాళికలను రూపొందించారు. ఈ సమావేశంలో రాజారెడ్డి, సుదర్శనం, రాజేంద్రప్రసాద్, గుర్రం శ్రీహరి, కళ్యా ణ్, యాకూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందుతున్న రీజియన్ జీఎంకు సన్మానం



రీజియన్ జీఎంను సన్మానిస్తున్న జీఎంలు

రామగిరి, సెప్టెంబరు 25: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్‌లో రీజియన్ జీఎం(నాణ్యత) వెంకటేశ్వర్‌రావును బుధవారం ఘనంగా సన్మానించారు. పద వీ విరమణ పొందుతున్న వెంకటేశ్వర్‌రావును జీఎం కార్యాలయంలో ఏర్పాటుచే సిన సమావేశంలో ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు వివిధ విభాగాల అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాధాకృష్ణ, శ్రీనివాసులు, రఘుపతి, సత్యనారాయణ, శేఖర్‌బాబు, యాదయ్య, వెంకటరమణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి

- ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 25: సింగరేణిలో కొత్త ప్రాజెక్టులు ప్రారంభించి ఉపాధి అవకాశాలు పెరిగేలా కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి పేర్కొన్నారు. బుధవారం ఓసీపీ-3 సీహెచ్‌పీలో జరిగిన గేట్‌మీటింగ్ లో ఆయన మాట్లాడారు. యాజమాన్యం కొత్తగా అమలు చేయాలని ఎల్లో కార్డు, రెడ్ కార్డులతో కార్మికులకు ఇబ్బందులు ఎదురు కావడంతో వాటిని రద్దు చేయించామని తెలిపారు. గత ప్రభుత్వాలు లాభాల వాటాలో కార్మికులను మోసం చేశాయని, పెద్ద ఎత్తున సింగరేణి నిధులను దారి మళ్లించినట్లు ధర్మపురి పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధికి కేటాయించిన నిధులతో కొత్త గనులు, పని స్థలాల్లో వసతులు, రక్షణ కోసం ఖర్చు చేయనున్నట్టు తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు రూ. 5వేల చొప్పున లాభాల వాటా ఇప్పించేలా యాజమాన్యాన్ని ఒప్పించిన ఘనత ఐఎన్‌టీయూదని అన్నారు. సీహెచ్‌పీలో దుమ్ము నియంత్రణా చర్యలు తీసుకోవాలని, కనీస వసతులు కల్పించాలని ధర్మపుర్తి డిమాండ్ చేశారు. ఈ గేట్ మీటింగ్‌లో ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి, నాయకులు అక్రమ్, వడ్డెపల్లి దాసు, ప్రభాకర్, లింగమూర్తి, దశరథం, అక్బర్ అలీ పాల్గొన్నారు.